# సజీవనిర్జీవం

ఆదివారం ఉదయం. ఆకలీ, శ్రీకర్ ఒకేసారి నిద్రలేచారు. రోజూ శ్రీకర్‌తో పాటే మేల్కొంటుంది ఆకలి. రోజంతా నమిలి మింగేస్తుంది ఆకలి పెద్దపులి.

రెండు నిముషాలు...మూడు నిముషాలు....నాలుగు....అయిదు. ఎంతకీ రాదేం? రోజూ నిద్ర లేవగానే నవ్వుతూ సెగలు గక్కుతూ ఆహ్వానించే కాఫీ ఇంకా రాదేం? కాఫీ తాగందే మంచం దిగే అలవాటు లేదు శ్రీకర్‌కి. చిరాకు మొదలయింది. మొహం మీద పడుతున్న జుట్టును అసహనంగా పైకి తోసుకున్నాడు. పక్కనే వున్న దిండును విసిరి కొట్టాడు.

అదుగో వచ్చింది. సజీవమైన కాఫీ పదార్థం భార్య సుధ ద్వారా టీపాయ్ మీదకి వచ్చింది. సుధ పలకరింపుగా నవ్వింది. శ్రీకర్ శ్రీమతి వంక ఒకసారి తీవ్రంగా చూశాడు. ఇంత ఆలస్యమా? అతని మనస్సు కాఫీ మీదికి దూకింది.

సిగరెట్ పెట్టె ఖాళీ.

మైగాడ్! ఎంత మతి మరుపు? నిన్న సాయంకాలం ఆఫీసునుంచి వస్తూ మరొపాకెట్ తెచ్చుకోవడం మర్చిపోయాడు. ఇక నుంచైనా ఇంట్లో ఎప్పుడూ నాలుగైదు పాకెట్లుంచాలి. కానీ ప్రస్తుతం? బంకులు కూడా దగ్గర్లో లేవు ఉంటే గజాని కొకటి. లేకపోతే మైళ్ళ పర్యంతం ఉండవు. ఛీ! శ్రీకర్ హడావుడిగా మంచం దిగి పాంటు వేసుకొని సిగిరెట్ల కోసం బయల్దేరాడు. స్కూటర్ బయటకి తీద్దామని తాళం చెవులకోసం టేబుల్ సొరుగు తెరవగానే గుర్తొచ్చింది. దాన్ని నిన్ననే అమ్మేశాడని, విసుక్కుంటూ కాలి నడకన వీధి మలుపుకు వచ్చాడు. అక్కడి బంకు ఇంకా తెరవలేదు. 'ఎనిమిదైనా ఇంకా తెరవలేదు. రోగ్!' తర్వాత కన్పించిన బంకులో తన బ్రాండ్ లేదు. అన్ని సిగిరెట్ల రుచీ ఆస్వాదించిన తర్వాత శ్రీకర్ తన బ్రాండ్‌ని జాగ్రత్తగా సెలక్ట్ చేసుకున్నాడు. ఖరీదైన రుచికరమైన ఫిల్టర్ సిగిరెట్ అది. ఆ బ్రాండ్‌ని సెలక్ట్ చేసుకున్నప్పటినుంచీ దానికీ శ్రీకర్‌కి విడదీయరాని సంబంధం ఏర్పడింది. ఆఫీసులో శ్రీకర్ మారు పేరు 'రాయల్' ఆ పిలుపు అతనికి గర్వకారణం. అది అతని బ్రాండ్ పేరు.

ముందుకి నడిచాడు శ్రీకర్. నోరంతా చేదుగా వుంది. కిలోమీటర్ నడవగా సిగిరెట్లు దొరికాయి. శ్రీకర్ అంతరాత్మ సిగిరెట్ మీద పడి వెలిగించి వరసగా నాల్గైదు పీల్పులు పీల్చి శాంతించింది.

శ్రీకర్ వెనక్కి తిరిగాడు. 'మార్నింగ్ వాక్ బాగుంది' అనుకున్నాడు. నడుస్తుంటే కాళ్ళు నొప్పెడుతున్నాయి. నడవడం ఎంత కష్టం! రోజూ స్కూటరుంటే తెలీడంలేదు. అమ్మయ్యక తప్పలేదు దాన్ని. ఎప్పుడో పెళ్లయిన సంవత్సరం కొన్నాడు. పాతబడి పోయింది. శ్రీమతి ఎంత గొడవ పెట్టింది అమ్మెయ్యొద్దని. చక్కగా పని చేస్తున్నప్పుడు పాత బడితే మాత్రమేమిటంటుంది. తనూ పాత మొహమే కదూ! దానికేం తెలుసు. ఆ స్కూటర్‌ని వాడివాడి మొహం మొత్తిందని? దాన్ని డిస్పోజ్ చేసి బ్రాండ్ న్యూ స్కూటర్ మరోటి కొనాలని తన ఆలోచన. స్కూటర్ లేకుండా గడిచేదెట్లా? హారిబుల్. ఇవాళ పది గంటలకి ఎక్కడిదో కొత్త స్కూటర్ వస్తుందన్నాడు రాజా. వెళ్ళాలి . వెళ్ళాలి. కొనాలి. కొనాలి.

శ్రీకర్ శరీరం ఇంటికి చేరింది. శ్రీమతి అడిగింది ఎక్కడికి వెళ్ళారని. చెప్పాడు. ఎందుకో నవ్వింది. ఇదే శ్రీకర్ రెండు రోజుల క్రితం తనకి విపరీతంగా తలనొప్పి వస్తే బజారుకి వెళ్ళి మాత్ర తీసుకు రావడానికి బద్ధకించాడనా?... శ్రీకర్ స్నాన పానాదులు ముగించి పడక్కుర్చీలో చేరగిల బడ్డాడు. రోజూ ఈ పాటికెంత బిజీ? హడావుడిగా ఆఫీసుకి పరిగెత్తే సమయం. ఇవాళంతా ఖాళీ. శ్రీమతి వంట ప్రయత్నాల్లో వుంది. పిల్లలెక్కడో ఆడుకోవడానికి వెళ్ళారు. గోడ గడియారం టిక్ టిక్ తప్ప అంతా చచ్చేంత నిశ్శబ్దంగా వుంది. 'వాతావరణం డల్‌గా వుంది' అనుకున్నాడు శ్రీకర్. ఏమీ తోచడం లేదు. సరిగ్గా పది గంటలకి డబ్బుతోపాటు రమ్మన్నాడు రాజా. కొత్త స్కూటర్ ఎలా వుంటుందో? లేటెస్ట్ కలర్ అట. కాస్త ముందుగా వెళితేనే మంచిది. శ్రీకర్ వాచ్ వంక చూసుకున్నాడు. ఇంకా తొమ్మిది గంటలే. అప్పటిదాకా ఏం చెయ్యాలి? స్కూటర్ సంగతి సుధకి చెప్పేస్తే? నో. ఇప్పుడంత ఖర్చెందుకని ఏడుస్తుంది. ఒక్కసారే కొత్త స్కూటర్ మీద డుగ్‌డుగ్ మంటూ వచ్చి సర్‌ప్రైజ్ ఇవ్వాలి. భలే థ్రిల్లింగ్‌గా వుంటుంది. తొమ్మిదీ ఐదు. ఎంత నెమ్మదిగా గడుస్తోంది టైం! కనీసం అరగంట దాకా ఏం చెయ్యాలి.

ఏదో ఛేజ్ నవల తీసి కళ్ళ ముందేసుకున్నాడు శ్రీకర్. కానీ అందులో ఎవడెవణ్ణి ఛేజ్ చేస్తున్నాడో అర్థం కావడం లేదు. అక్షరాలన్నీ ఒకే మాదిరిగా కన్పిస్తున్నాయి. బోర్! విసుగ్గా పుస్తకాన్ని గిరాటేశాడు. లేచి టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. డిస్కోలో లేటెస్ట్ హిట్స్ విన్పిస్తున్నాయి. "అయామ్ కామింగ్...రోజూ వింటూ ఊగిపోయే మ్యూజిక్. ఈ రోజెందుకో చెవుల్లోకి దూరడం లేదు. బోర్! ఆఫ్ చేశాడు. మళ్ళీ టైం చూసుకున్నాడు. తొమ్మిదిన్నర కావస్తోంది. అమ్మయ్య! ఇక బయల్దేరొచ్చు. కమాన్ గెటప్! శ్రీకర్ హుషారుగా ఈల వేసుకుంటూ తయారయ్యాడు. డబ్బు లెక్క పెట్టి జేబులో వేసుకున్నాడు.

బయటికి నడుస్తుండగా లోపల్నుంచి తుమ్ము విన్పించింది. డామిట్! అపశకునం. కాసేపు కూర్చుని వెళ్తే?...నాన్సెన్స్. అర్థంలేని అనుమానాలు. ఈ నమ్మకాలతో ఇలానే కూర్చుంటే ఆ స్కూటర్ కాస్తా ఎగిరి పోవచ్చు. హరియప్!

శ్రీకర్ వెళ్లాడు కొత్త స్కూటర్ చూశాడు. చూసిన మరుక్షణం కొనేశాడు. ఆపిల్ పండులా నిగనిగలాడుతున్న స్కూటర్ అతని సొంతమైంది. రేటు కొంచెం ఎక్కువైతే మాత్రమే? వాటీజ్ దేర్ ఇన్ మనీ? స్కూటర్ తనది కాగానే దాన్ని పాలిష్ గుడ్డతో శుభ్రంగా తుడిచాడు. 'క్లీన్‌గానే వుంది" అన్నాడు రాజు. అయితేనేం తన తృప్తి తనది. స్కూటర్‌ని తాకుతుంటే ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది. స్కూటర్‌లో తనను తాను చూసుకొని సంతృప్తి పడ్డాడు శ్రీకర్. ఇంటికొస్తుంటే గాలిలో తేలిపోతున్నట్టనిపించింది. శరీరమూ మెదడూ నిండిన అనుభూతి. అంతలోనే శ్రీకర్ అనుభూతిని ఉఫ్‌న ఊదేస్తున్నట్టు పక్కనుంచి సిటీ బస్ దూసుకెళ్ళింది. నల్లటి పొగమేఘాల్ని స్కూటర్ మీద స్ప్రే పెయింట్ వేస్తూ. ఉబుకుతున్న కోపాన్ని బలవంతాన దిగమింగాడు శ్రీకర్.

కొత్త స్కూటర్ కన్పించగానే శ్రీమతి ఒక్కక్షణం ఆశ్చర్యంతో ఏదో అనబోయి మరుక్షణం నిర్లిప్తంగా వుండి పోయింది. కొడుకూ కూతురూ దాని మీద ఎక్కడానికి పోటీ పడ్డారు. శ్రీకర్ వాళ్లని కసిరి అవతలకి పంపించాడు. దుమ్ము కొట్టుకున్న పిల్లల్ని కూర్చోబెడితే మాసిపోదా? అయినా కొడుకు స్కూటర్ ఎక్కాల్సిందేనని మారాం చేశాడు. శ్రీకర్ విసుగ్గా ఒక్కటి అంటించాడు. వాడు ఏడుపు లంకించుకున్నాడు. సుధ వాణ్ణి దగ్గరికి తీసుకొంది.

"పిల్లలు. వాళ్ళకేం తెలుసు? కాసేపు స్కూటర్ మీద కూర్చో బెడితే ఏమైంది?" అంటూ వెనకేసు కొచ్చింది.

కొత్త స్కూటర్ తెస్తే బాగుందని కనీసం ఒక్కమాట కూడా అనలేదు. శ్రీకర్‌కి చిరాకేసింది.

"నీకూ అంత కంటే ఏమీ తెలీదు పాపం. డిసిప్లిన్ లేకుండా వాళ్ళనలా తయారు చేశావు. వాళ్ళెక్కి తొక్కితే కొత్త స్కూటర్ పాడైపోతుందని తెలీదా? ముందు నీకే ఇష్టం లేనట్టుంది".

"అవును మరి. ఇప్పుడంత అవసరం ఏమొచ్చింది? ఒక వైపు మామయ్యకి జబ్బుగా వుంటే కనీసం వందైనా పంపించడానికి ఇష్టం లేక పోయింది మీకు. ఇప్పుడు వేలకు వేలు పోసి కొత్త స్కూటర్ కొనడానికి మనస్సెలా ఒప్పిందండీ? పోనీ ఆ డబ్బు కాస్త వెనకేసుకున్నా ముందు ముందు పిల్లలికి వుపయోగపడేది కాదా?"

అయిందా దండకం? పిల్లల బాగోగుల గురించి నీకే శ్రద్ధ వున్నట్టూ, నాకు వాళ్ళ మీద ప్రేమే లేనట్టూ మాట్లాడతావేం?"

"లేకేం? మనకెంత ప్రేముందో రోజూ వాళ్ళ వీపుల మీద తేలే వాతలే చెబుతాయి.

వాళ్ళని ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం నేనింత వరకూ చూడలేదు."

శ్రీకర్ ఇక భరించలేక పోయాడు. పిల్లల ముందు తన గురించి చులకనగా మాట్లాడుతోంది? ఎంత వ్యంగ్యం?

"ఇక ఆ సొద ఆపుతావా? లేదా?" అన్నాడు కోపంగా.

"మనుషుల కంటే వస్తువులే ముఖ్యం అయినప్పుడు సొదగానే వుంటుంది. మరి." అంటూ సుధ పిల్లల్ని తీసుకుని విసవిసా లోపలికి వెళ్లిపోయింది.

చివరి మాట శ్రీమతి కావడం చేత శ్రీకర్ ఉక్రోషం మితిమీరి పోయింది. మనుషుల కంటే వస్తువులే ముఖ్యమా తనకి? భార్యా పిల్లలకేం లోటు చేశాడు తను? ఇంట్లో దేనికీ ఇబ్బంది లేకుండా సంపాదించి పెట్టడం లేదా? అడిగీ అడక్క ముందే ఎన్నెన్ని చీరలు తెచ్చి పడెయ్యలేదు తను? కృతజ్ఞత ఏకోశానా లేదు మనిషికి. తనకీ పిల్లలకీ చనువిచ్చి నెత్తికెక్కించు కోలేదని కాబోలు. అసలు మొదటి నుంచీ పెళ్ళాన్ని అదుపులో వుంచకపోవడం తనదే తప్పు. ఏపని చేసినా ఏదో ఒక వంకతో విమర్శిస్తుంది. ఏదో ఒక సీన్ క్రియేట్ చేస్తుంది. ఇన్నేళ్ళుగా ఈ మనిషితో ఎలా కాపురం చేశాడు తను?

ఇంతలో స్కూటర్ మీద ఎండ పడుతోందని గుర్తొచ్చింది శ్రీకర్‌కి. వెంటనే నీడలోకి నడిపించి స్టాండ్ వెయ్యబోయాడు తొందరలో ఇంజన్ బరువువల్ల గబుక్కున పక్కకి ఒరిగింది. కుడివైపు రెక్క సొట్ట పడింది. శ్రీకర్ ప్రాణం విలవిల లాడింది. "వెధవ అపశకునం. వెళుతుండగానే తుమ్మిందిగా. పడకుండా ఎలా వుంటుంది?" అనుకున్నాడు. సొట్ట సరిచెయ్యడానికి ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు. స్కూటర్ కొన్న వుత్సాహం రవ్వంత క్షీణించింది. స్కూటర్‌కి తెలుసు, మరో వారంలో తండ్రి చావు బ్రతుకుల్లో వున్నా శ్రీకర్ ప్రాణం ఇంతగా విలవిల్లాడదని, సానుభూతితో అతణ్ణి ఓదార్చింది.

"ఎందుకు శ్రీకర్ అంతబాధపడతావు? ఎలాగూ రెండేళ్ళ తర్వాత అమ్మేసి మళ్ళీ కొత్తది కొంటావు గదా? ఈ మాత్రానికే అంత విచారం దేనికి?"

శ్రీకర్ శాంతించాడు. లోపల్నుంచి సుధ కేకేసింది భోజనానికి. భోంచేస్తూ భార్యతో చెప్పాడు. రాజుతో ఆమధ్యాహ్నం సినిమా ప్రోగ్రాం వుందని.

"మీకు గుర్తుందో లేదో సాయంకాలం రమేష్ బాబు పెళ్ళికి వెళ్ళాలి మనం" అంది సుధ.

ఆమె కంఠంలో ఇందాకటి విసురు లేదు. సాధారణంగా వుంది. "ఎంత నిగ్రహం దీనికి?" అనుకున్నాడు శ్రీకర్.

"మర్చేపోయాను. అయినా పెళ్ళి ఏడుగంటలకి కదా? ఎర్లీగానే వచ్చేస్తాను." అన్నాడు పైకి.

"కానీ మనం ముందుగా వెళితే బాగుంటుందేమో."

తనకి తెలీదా ఆ సంగతి? ఇదంతా సినిమా ప్రోగ్రాం చెడగొట్టడానికి వేసే ప్లాను.

ఏది ఏమైనా పిక్చర్‌కి వెళ్ళి తీరాల్సిందే.

"ఏం ఫర్వాలేదు. ముందుగా వెళ్ళి మాత్రం చేసేదేముంది? రమేష్ అయినా ఏమనుకుంటాళ్ళే" అని తేలిగ్గా తీసేశాడు శ్రీకర్.

సుధ మౌనం వహించింది. ముందుగా వెళ్ళకపోతే రమేష్ తప్పకుండా బాధ పడతాడనీ, రమేష్ తండ్రే శ్రీకర్‌కి ఉద్యోగం ఇప్పించాడనీ, అంచేత ముందే వెళ్ళి పెళ్ళి పనుల్లో సాయపడితే బాగుంటుందనీ భర్తకి చెప్పాలనిపించలేదు ఆమెకి. పిల్లల్నీ తననీ తీసుకొని సినిమాకి వెళ్ళి ఎన్నాళ్ళయిందో? తన సంగతే తప్ప ఎదటి వాళ్ళ విషయం ఏనాడూ పట్టించుకోలేదు తను. ఇద్దరి మధ్య ఎంత అగాధం వుంది. అందరికీ దూరంగా పెద్దగిరి గీసుకుని దాన్లో బతుకుతున్నారాయన. ఆగిరిలో ఎన్నటికీ నిజమైన సంతృప్తి లభించడం వట్టిది అనుకుంది సుధ.

భోంచెయ్యగానే పడుకుని ఓ కునుకు తీశాడు శ్రీకర్. తర్వాత ఆ రోజుదిన పత్రిక ముందేసుకుని సినిమా కాలమ్ చూడసాగాడు కొత్త స్కూటర్ కొన్న సందర్భంగా తనే రాజును సినిమాకి తీసుకెళ్ళాలి. ఏ సినిమాకి వెళ్ళాలో తనకొది లేశాడు రాజు. సినిమాలన్నీ దాదాపు చూసేసినవే. ఆ రోజు విడుదలవుతున్న పిక్చర్ ఒకే ఒక్కటుంది. అందుతుందా?

రిజర్వేషన్ వుందా? శ్రీకర్ తక్షణం ఆ హాలు మేనేజర్‌కి ఫోన్ చేశాడు. రిజర్వేషన్ లేదని తెలిసింది. ఏమైనా సరే ఆ పిక్చర్ చూసి తీరాల్సిందే. పది రోజుల క్రిందట విడుదలైన మరో సినిమా వుంది. కానీ పాత సినిమాలకేం వెళ్తాం? లేటెస్ట్ సినిమాకి వెళ్ళల్సిందే. శ్రీకర్‌లో ఆకలి లేచింది.

ఒంటి గంటకల్లా శ్రీకర్ రాజుతో పాటు సినిమాహాలు ముందున్నాడు. హాలు దగ్గర అంతా కోలాహలంగా ఉంది. జనం ఆందోళనగా అటూఇటూ తిరుగు తున్నారు. టికెట్ కౌంటర్స్ ఇంకా తెరవలేదు. పోస్టర్స్ చూస్తున్నకొద్దీ శ్రీకర్‌కి ఆ సినిమా చూసి తీరాల్సిందే నన్పించింది. మంచి డాన్సులున్నట్టున్నాయి పిక్చర్‌లో.

"ఇంత రష్‌లో సినిమా ఏం ఎంజాయ్ చేస్తాం? మరో పిక్చర్‌కి వెళితే పోలా?" అన్నాడు రాజు.

"నో. పిక్చర్ ఫస్ట్‌డే చూస్తేనే థ్రిల్. టికెట్స్ దొరక్కపోతే మన గొప్పేముంది?" అని సమాధానమిచ్చాడు శ్రీకర్.

డైమండ్ సర్కిల్ క్యూ హాలు ఆవరణ దాటి రోడ్డుమీద క్కూడ సాగింది శ్రీకర్ ఎండలో తడిసి పోతున్నాడు. అతడి మొహంలో టికెట్స్ దొరుకుతాయా లేదా అనే జీవన్మరణ సమస్య మెరుస్తోంది. ఇంకా అరగంట వెయిట్ చెయ్యాలి. హారిబుల్. కానీ తప్పదు. పిక్చర్ చూసి తీరాలి. క్యూలో చాలా వెనక్కున్నాడు తను. టికెట్స్ దొరుకుతాయా... ఇంకా పావుగంట. టికెట్స్ దొరుకుతాయా? ...ఓన్లీ త్రీ మినిట్స్. టికెట్స్ దొరుకుతాయా? ప్రశ్నకి సమాధానం మీదనే భవిష్యత్తంతా ఆధారపడి

వున్నట్టనిపించింది. బొమ్మా బొరుసు వేస్తే? బొమ్మయితే దొరుకుతాయి బొరుసైతే ఖాళీ. శ్రీకర్ జేబులోంచి పావలా బిళ్ళ తీసి ఎగరేసి పట్టుకున్నాడు. బొమ్మా? బొరుసా? చూడ్డానికీ రవంత భయం వేసింది. తీరా చూస్తే బొమ్మే! హుషారుగా ఈలవేశాడు శ్రీకర్. రాజా చూడలేదు. సినిమాకి వచ్చిన ఆడవాళ్ల వైపే చూస్తున్నాడు.

క్యూ కదిలింది. శ్రీకర్‌లో మళ్ళీ సందేహం. కొత్త స్కూటర్ ఆఫీసులో ఫ్రండ్సందరికీ నచ్చుతుందా? బ్రాంచ్ ఆఫీసర్‌గా తనకి ప్రమోషన్ వస్తుందా? స్టెనో కళ్యాణి ఎప్పటికైనా తనతో పిక్చర్‌కి వస్తుందా? ఈ సమస్యలన్నీ రూపం కోల్పోయి ఒకే ఒక ప్రశ్నగా శ్రీకర్ ముందు నిలబడ్డాయి.."టికెట్స్ దొరుకుతాయా.." భరించలేని టెన్షన్. టికెట్స్ అందిన వాళ్ళ మొహంలో వెయ్యివోల్టుల కాంతి. ఇంకా పదిమంది ముందున్నారు. ఐదుగురు..ముగ్గురు మై గాడ్! బుకింగ్ క్లోజ్ అయింది. వాట్ ఈజ్ టు బి డన్?

శ్రీకర్ మొహంలో కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు. బొమ్మా బొరుసు ఘోరంగా ఫెయిలైంది. రాజా ఎగతాళిగా నవ్వాడు. శ్రీకర్‌కి అంతతేలిగ్గా ఓటమి నంగీకరించడం అవమానకరం అన్పించింది. అటూ ఇటూ పరీక్షగా చూశాడు. హాలు బయట బ్లాక్‌లో ఎవరైనా టికెట్స్ అమ్ముతున్నారేమో. 'ఒన్ మినిట్' అని రాజాతో చెప్పి బయట జనంలోకి వెళ్ళిపోయాడు. పది నిమిషాల్లో తిరిగి వచ్చాడు. చేతిలో రెప రెపలాడే టిక్కెట్లు. మొహంలో ప్రపంచాన్ని జయించిన విజయం తాలూకు చిరునవ్వు.

"డన్" అన్నాడు. శ్రీకర్ టిక్కెట్లు చూపిస్తూ.

"ఎంత?" అడిగాడు రాజా.

"ట్వంటీ ఫైవ్"

"హాఫ్ బాటిల్ వచ్చేది."

"నెవర్‌మైండ్. పద." అంటూ హాల్లోకి దారితీశాడు శ్రీకర్. అతణ్ణి మొన్న వుదయం కూతురేదో బొమ్మ కావాలని ముద్దుగా అడిగిందా? షాపులో చూసి ఇరవై రూపాయలు దండగెందుకని వట్టి చేతుల్తో వచ్చాడా? కూతురు బిక్కమొహం వేస్తే కనీసం ఎత్తుకొని సముదాయించలేక పోయాడా? ఏమో.

మరి కాసేపటికి శ్రీకర్ సినిమాలో లీనమయ్యాడు. ఫ్యాన్లు తిరుగుతున్నా భరించలేని వుక్కలో మనుషుల చెమట కంపులో పిక్చర్‌ని ఎంజాయ్ చేశాడు. రెండున్నర గంటల సినిమా అతణ్ణి తనలో కలుపుకొంది. రెండున్నర గంటలసేపు శ్రీకర్ సినిమాని సొంతం చేసుకు జీవించాడు.

"డొక్కు సినిమా" అన్నాడు రాజా బయటికి వచ్చిన తర్వాత. అతనికి పిక్చర్లో హీరో హీరోయిన్ల కౌగిలింతలు తప్ప మరేం నచ్చలేదు.

"ఏదో ఒకటి. జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్. ఫస్ట్‌డే చూడ గలిగాం. అయినా ఆ ఒక్క

డాన్స్‌కే ఇవ్వొచ్చు." అన్నాడు శ్రీకర్.

ఇంటికొచ్చే సరికి ఆరు గంటలైంది. సుధ పిల్లల్తో కలిసి ఆడుకుంటోంది. పిల్లలు వెంట బడుతుంటే చిక్కకుండా పరుగెత్తుతూ నవ్వుతోంది. శ్రీకర్‌ని చూడగానే పిల్లలు కేరింతలు మానేసి నిశ్శబ్దంగా వుండి పోయారు. అతని కెందుకో ఆ దృశ్యం నచ్చలేదు. "నాదగ్గర కొచ్చే టప్పటికి ఎక్కళ్ళైని చిరాకులూ పరాకులూ వస్తాయి" అనుకున్నాడు భార్యనుద్దేశించి.

"రెడీ అయ్యారన్నమాట" అన్నాడు స్కూటర్ స్టాండు వేస్తూ.

"మీదే ఆలస్యం" అంది సుధ.

శ్రీకర్ స్నానం ముగించి హడావుడిగా తయారయ్యాడు. నెల కిందట కుట్టించిన సఫారీ డ్రెస్ వేసుకున్నాడు. ఎందుకో మొదటిసారి ఆ డ్రెస్ వేసుకున్నప్పటి ఆసక్తి నశించింది. "వారంనాడు ఆఫీసులో ఫంక్షన్‌కి ఇదే డ్రెస్. ఇవాళా ఇదే. మళ్ళీ మళ్ళీ వేసుకోవాలంటే బోర్. మరో సూట్ కుట్టించుకోవాలి. పెళ్ళికి కళ్యాణి కూడా వస్తే ఇదే సూట్ చూసి ఏమనుకుంటుందో" అనుకున్నాడు. బూటు లేసులు బిగించాడు. తీరా బయల్దేర బోతూ భార్య వంక పరీక్షగా చూశాడు. ఆమె అలంకరణ ఏ మాత్రం నచ్చలేదు.

"ఇంకాస్త శ్రద్ధగా మేకప్ చేసుకుంటే ఏం పోయింది? ఆ డొక్కు చీర తప్ప మరేవీ లేవా ఏమిటి?" అన్నాడు.

"మరీ ఎబ్బెట్టుగా అలంకరించుకుంటే మాత్రం ఏం బాగుంటుంది? ఈ చీరకేం? ఉన్న వాటిల్లో ఇదే మంచిది" అంది సుధ.

"నాకేం నచ్చలేదు. ఆ బ్లూ శారీ కట్టుకురా. ఈ వేషంలో వస్తే వాళ్ళందరి మధ్య ఎంత ఆక్వర్డ్‌గా వుంటావో తెలుసా? నీకేం? నాపెళ్ళామనే అంటారందరూ, ఊఁక్విక్."

సాదాగా వుండటం తన కిష్టం. కానీ తప్పదు, ఇష్టం లేకపోయినా చీర మార్చుకోడానికి లోపలికి వెళ్ళింది సుధ. కాసేపట్లో శ్రీకర్ భార్యలా తయారైవచ్చింది.

"ఇట్స్ బెటర్ నౌ. కమాన్" అంటూ లేచాడు శ్రీకర్.

వసంత నగర్‌లో పెళ్ళి యింటికి వెళ్ళేసరికి అంతా కోలాహలంగా వుంది. రమేష్ నవ్వుతూ ఎదురొచ్చి శ్రీకర్ కూతుర్ని ఎత్తుకున్నాడు.

"మీకోసం చాలా సేపటినుంచీ చూస్తున్నాను. ఇంత ఆలస్యం చేశారేం?" అడిగాడు రమేష్.

"ఎక్కడా? ఆవిడగారు తెమిలేసరికి ఈ టైమైంది." అన్నాడు శ్రీకర్ తడుముకోకుండా.

సుధ మొహంలో చిరునవ్వు మాయమైంది. రమేష్‌తో కాసేపు మాట్లాడిపిల్లల్తో ఆడవాళ్ళున్న వైపు వెళ్ళింది. రమేష్ మరెవర్నో రిసీవ్ చేసుకోవడానికి వెళ్ళాడు.

పెళ్ళి పందిరంతా రంగు రంగుల్తో రక రకాల సువాసనల్తో, పట్టుచీరల పెళపెళల్తో,

అందాల తళ తళల్లో, నవ్వుల్లో కేరింతల్లో, కళకళ లాడుతోంది. ఆహ్లాదకరంగా వుంది. ఉద్రేకంగా వుంది. పెళ్ళి వాతావరణాన్ని ఎంజాయ్ చెయ్యసాగాడు శ్రీకర్. ఎవరెవరో ఫ్రెండ్స్‌తో కబుర్లు, సెక్సీ జోకులు, విరగబడి నవ్వులు, అటూఇటూ ఫ్యాషన్ పెరేడ్ బొమ్మల్లా తిరిగే అమ్మాయిల్తో సరసాలు. మధ్య మధ్య పానీయాలు, సిగిరెట్ పొగలు. పెళ్ళికొచ్చిన వాళ్ళలో చాలా మంది శ్రీకర్‌కి పరిచయస్థులే. అతని ఫ్రెండ్స్ సర్కిల్ విశాలమైంది. అందుచేత ఆ వాతావరణంలో సరదాగా జోకులు వేస్తూ నవ్విస్తున్న శ్రీకర్ సహజంగా ఆకర్షణా కేంద్రం అయ్యాడు. ఆడవాళ్ళుకూడా మధ్య మధ్య అతని వంక చూస్తున్నారు. శ్రీకర్ మనస్సు జాలీగా వుంది.

స్టైనో కళ్యాణి కూడా వచ్చింది పెళ్ళికి. పాతికేళ్ళ పెళ్ళికాని అందం ఆమెది. పింక్ కలర్ షిఫాన్ చీరలో, తీర్చి దిద్దిన కనుబొమల్తో, కేకూ పౌడరూ కప్పేసిన ఎర్రటి మొహంతో మొహంలో మెరిసే నవ్వుతో శ్రీకర్‌ని ఎప్పటి కంటే ఆకర్షించింది. శ్రీకర్ చూపులు ఆమె అందాన్ని గుక్క గుక్కగా తాగేశాయి. అతనికి కిక్కొచ్చింది. దాదాపు పావుగంటసేపు అతనితో ఏవేవో కబుర్లు చెబుతూ, అతని జోకులకు నవ్వుతూనే వుంది కళ్యాణి. తన ప్రమోషన్ అతని సిఫార్సు మీద కొంతైనా ఆధారపడి వుందని ఇద్దరికీ తెలుసు. శ్రీకర్ కళ్యాణికి డ్రింక్ ఆఫర్ చేస్తూ ఆమె చేతిని తాకాడు. కళ్యాణి ఎందుకో పడీ పడీ నవ్వింది.

అతనికి పిచ్చెత్తేలోగా మరెవరో ఆమెని పలకరించారు. కళ్యాణి అతన్తో కబుర్లు పెట్టుకుంది అవే అనవసరంగా సిగ్గు నభినయించే నవ్వుల చూపుల్తో, అవే గుండెల్ని గాయపరిచే చూపుల నవ్వుల్తో. శ్రీకర్ మొహం చిట్లించాడు. మనస్సులో ఏదో ఆందోళన. తెలీని బెదురు.

ఇంతలో మరో స్నేహితుడు శ్రీకర్‌ని పలకరించి తన భార్యని పరిచయం చేశాడు. కాజువల్‌గా చూస్తున్నట్టే ఆమెని తేరిపార చూశాడు శ్రీకర్. కళ్యాణికంటే ఎరుపుతో, ఎరుపులో మెరుపుతో, ఎరుపును మించే లిప్‌స్టిక్‌తో, వెనక అందాల్ని పెంచే హైహీల్స్‌లో ఎంత అందంగా వుంది! వాళ్ళ పెళ్ళికి వెళ్ళలేక పోయినందుకు 'సారీ' చెప్పాక సరదాగా కబుర్లు ప్రారంభించాడు. అంతలో పెళ్ళి తంతు మొదలైంది. వాళ్ళెటో వెళ్ళిపోయారు. శ్రీకర్ డిసప్పాయింట్ అయ్యాడు.

పెళ్ళి, భోజనాలూ ముగిసేసరికి తొమ్మిది గంటలైంది. శ్రీకర్ రమేష్ వద్ద సెలవు తీసుకుని నాలుగడుగులు వేసి ఎటో ఎందుకో చూడసాగాడు. సుధ కాసేపు రమేష్‌తోనూ అతని భార్యతోనూ మాట్లాడి పిల్లల్ని తీసుకొని శ్రీకర్ వద్దకి వచ్చింది. "పిల్లల కోడిలా వుంది' అనుకున్నాడు శ్రీకర్ వస్తున్న భార్యని చూస్తూనే. హఠాత్తుగా అలాంటి ఊహ వచ్చినందుకు నవ్వుకున్నాడు. ఇంటికి బయల్దేరారు. పిల్లలు దార్లోనే నిద్రపోయారు. ఇంటికి రాగానే సుధ పిల్లలకి పక్కలు సర్ది పడుకోబెట్టింది. చీర మార్చుకుని వచ్చి శ్రీకర్

పక్కనే పడుకుని అలసటగా కళ్ళు మూసింది. శ్రీకర్‌కి నిద్ర రావడం లేదు. కళ్ళముందు ఏవేవో అందచందాలు కదుల్తున్నాయి. మనస్సు బరువెక్కింది. ఆవేశంతో పక్కనే వున్న స్త్రీని దగ్గరకి లాక్కున్నాడు. సుధ కళ్ళు విప్పింది.

"అలసటగా వుంది" అంది నెమ్మదిగా.

"ఎందుకని?" ప్రశ్నించాడు శ్రీకర్.

"పెళ్ళిలో ఆ పనీ ఈ పనీ అందుకున్నాను. భోజనం కూడా సరిగా చెయ్యలేదు."

"ఎందుకొచ్చిన అవస్థ అదంతా?"

"కావలసిన వాళ్ళుగదా! పైగా మన కెంతో సాయం చేసి వున్నారాయె మరి పట్టనట్టెలా వుంటాం చెప్పండి."

"మొగుడు దగ్గర మాత్రం అంటీ ముట్టనట్టు ఉండొచ్చన్నమాట."

"ఆ మాటన్నానా నేను? నిజంగా అలసటగా ఉంది."

"బయట వాళ్ళకోసం ఎంత కష్టమైనా పడొచ్చు. మొగుడు దగ్గర కొచ్చేటప్పటికి మాత్రం ఎక్కళ్ళేని అలసటా వస్తుంది." కోపాన్ని సాధ్యమైనంత నాజుగ్గా వ్యంగ్యంగా వ్యక్తీకరించాడు శ్రీకర్.

సుధ ఒక్కసారి భర్తవంక తేరిపార చూసింది. శ్రీకర్ మొహం తిప్పుకున్నాడు. నిశ్శబ్దంగా భర్త వద్దకి జరిగింది. శ్రీకర్ అవేశంతో భార్యని తనలోకి లాక్కున్నాడు. ఎరుపెక్కిన కళ్ళు. నరాలు పెట్లిపోయే ఉద్రేకం. సజీవ నిర్జీవ సంబంధం..వణికే పెదాల్ని గాట్లుచేసి నెత్తురు రుచి చూసిన ఆకలి...బాధతో నీళ్ళుతిరిగే మొహాన్ని కసిగా ముద్దాడిన ఆకలి...అనుభవం తప్ప ఆనందం శూన్యమైన పదినిమిషాల అలిసిపోయిన ఆకలి..శరీరానికి కాంతి సంవత్సరాల దూరమైన మనస్సులో పొందీ పొందని తీరీ తీరని ఆకలి...

శ్రీకర్ పడుకునే టీపాయ్ మీదున్న పాకెట్ అందుకుని సిగిరెట్ వెలిగించాడు. పొగ సరిపడని సుధ దూరంగా జరిగింది. శ్రీకర్ కెందుకో చికాగ్గా అసంతృప్తిగా వుంది. గుండెల నిండుగా పొగ. భార్య వంక చూశాడు. గాట్లు పడ్డ బుగ్గలు. గాయ పడ్డ పెదాలు, అదే మొహం. అదే వళ్ళు. పొంకం లేని అవయవాలతో అసహ్యంగా. బిగి సడిలిన రొమ్ముల్తో అసహ్యంగా...పాత బడ్డ అందంతో అసహ్యంగా...అరిగిపోయిన పాతబడిన యంత్రం. పాత డొక్కు స్కూటర్. టు బి డిస్పోజ్డ్ ఆఫ్!

...అతను నిద్రపోయాడు. ఆకలికి నిద్రలేదు.

*• ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక, 1984 •*

రచన : 22.09.83